# రాష్ట్రపతి గారు వెలుగుమట్ల లో ఇల్లు కూల్చిన అధికారులను మంత్రులను శిక్షించండి



ఖమ్మం జూన్ 08 (వుదయం ప్రతినిధి) : వెలుగుమట్లలో సంపూర్ణ వెలుక్రై బీసీ ఎస్సీ ఎస్టీ జేపీసీ మరియు భూదాన బాధితుల నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందితో ఖమ్మం పురవీధుల్లో ఉత్తరాలను ప్రదర్శించుకుంటూ ఉత్తరాల ఉద్యమాన్ని మహా ర్యాలీని నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ ఎస్సీ ఎస్టీ జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ హాజరై రాజ్యాంగా స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా రాష్ట్రపతి కి , ప్రధానమంత్రి కి , ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి , తెలంగాణ గవర్నర్ కి , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బాధితులు తమ బాధను ఉత్తరాల ద్వారా విన్నవించుకున్నారు . ఇంత పెద్ద మహా ర్యాలీని నిర్వహించడం అనేది ఇది ఒక అంబేద్కర్ స్ఫూర్తితో నిర్వహించడం . తక్షణమే స్థానిక మంత్రులు అధికార ప్రతినిధులు మేల్కొని వెలుగుమట్లలో 100 గజాల్లో అర్హులైన బాధితులకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేనియెడల సాధించేదాకా బాధితులకు మా మద్దతు ఉంటుందని తెలియజేశారు . రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగింది ఓ నరమేధమని ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధమని మా ఆత్మగౌరవం నిలుపుకునేందుకు స్థానిక మంత్రులను అధికారులను శిక్షించేందుకు భారత రాష్ట్రపతి ని కలుస్తున్నామని మా ఆత్మ గౌరవాన్ని కలిగించేందుకు తక్షణమే వారి ఆస్తిని కూడా జప్తి చేసి ఆ సొమ్మును బాధితులకు ఇవ్వాలని మొరపెట్టుకుంటున్నాము . అందుకు అన్ని సామాజిక సంస్థలు ఆయా రాజకీయ పార్టీలు సహకారం అందించాలని అన్నారు . స్థానిక అడ్వకేట్ వంజాకుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతంలో ఇంత రాజ్యాంగ స్ఫూర్తితో ర్యాలీని నిర్వహించడం గర్వకారణమని బాధితులే తమ బాధను ఉత్తరాల రూపంలో రాష్ట్రపతి కి అందించడం బాధితులు చేస్తున్న ఈ జ్ఞాన పోరాటం ఈ దేశానికి అంకితం అని అన్నారు . ఇకనైనా అధికారులు మేల్కొని తక్షణమే వారికి ఇల్లు నిర్మించాలని అన్నారు . నిజానిధారణ కమిటీ కన్వీనర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ మా ఇల్లు సాధించుకునే దాకా ఈ పోరాటం కొనసాగుతుందని ఇది మా ఆత్మగౌరవ పోరాటమని అన్నారు . ఈ కార్యక్రమంలో కన్వీనర్ వట్టే ఉదయ్ కిరణ్ , మట్టే నవ్య , సుమలత , రామకృష్ణ , కృష్ణ , రాము తదిరిలు పాల్గొన్నారు

# సూర్యాపేట ప్రజావాణికి 77 దరఖాస్తులు పెండింగ్ ఫైళ్లపై యుద్ధప్రాతిపదికన చర్యలు

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జూన్ 08 (వుదయం ప్రతినిధి) : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం చూపాలి

**ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**అర్జీలపై వ్యక్తిగత పర్యవేక్షణతో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

భద్రాచలం, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, ప్రజల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారాలు అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్, ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ ప్రభుత్వానికి అత్యంత విలువైనదని, వాటి పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ప్రధానంగా భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలు, వారసత్వ హక్కుల నమోదు, పట్టాదార్ పాస్ పుస్తకాల సవరణలు, పింఛన్ల మంజూరు, రేషన్ కార్డుల సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన అర్జీలు, ఉపాధి హామీ పథకం, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీటి సౌకర్యం, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు మరియు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరుగుతుందని, దాని పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖాధిపతి తమ శాఖకు సంబంధించిన అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించి, ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల మధ్య సమన్వయం లోపించకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు




నిజమైన అర్హులకు చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ సేవలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే సమస్యలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి పౌరుడిని గౌరవంగా స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని తగిన మార్గనిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ద్వారా పరిపాలనపై నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిపత్రంపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ తోట రవికుమార్, డీఎల్పీఓ సుధీర్, డీఏవో భగవాన్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సతీష్‌తో పాటు భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు ప్రజల సమస్యలను ఓపికగా విని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గిరిజన యువతకు భారీ ఉపాధి అవకాశాలు

- **25 కోర్సుల్లో 2,500 మందికి నైపుణ్య శిక్షణ**
- **జూన్ 12లోపు నిరుద్యోగ యువత వివరాలు పంపాలి**
- **ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ ఆదేశాలు**

భద్రాచలం, జూన్ 08 (వుదయం ప్రతినిధి): గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు సెక్టార్ స్కిల్ కౌన్సిలింగ్ ద్వారా 25 రకాల వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ అందించి, వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబర్ నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించి, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ పథకం కింద ఆరు ప్రధాన రంగాల్లో 25 రకాల కోర్సుల ద్వారా సుమారు 2,500 మంది గిరిజన యువతి, యువకులకు 90 రోజులపాటు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం అభ్యర్థుల నైపుణ్యాలకు అనుగుణంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి కోసం ముద్ర రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకారం అందిస్తామని చెప్పారు. భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లందు, ఖమ్మం కేంద్రాల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కనీసం పది మంది చొప్పున నిరుద్యోగ గిరిజన యువతను గుర్తించి వారి వివరాలను జూన్ 12లోపు పంపించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జూన్ 15 నుంచి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిరుద్యోగుల జాబితా తయారుచేసే సమయంలో



వారి పూర్తి పేరు, మొబైల్ నంబర్, విద్యార్హతలు, ఎంచుకున్న కోర్సు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. సర్పంచులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి గిరిజన యువకుడు, యువతి ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. జప్రభుత్వం అందిస్తున్న ఈ అరుదైన అవకాశాన్ని గిరిజన యువత సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకొని మంచి ఉపాధి అవకాశాలను పొందాలని డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు. ఏవైనా సందేహాలు, ఇతర వివరాల కోసం ఖమ్మంలోని డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కార్యాలయం లేదా ఐటీడీఏ కార్యాలయంలోని జేడీఎంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రతి నెల 9న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ జిల్లా క్యాంపులు

**– హైరిస్క్ గర్భాలపై ప్రత్యేక దృష్టి: డిఎంహెచ్ఓ**

సూర్యాపేట జూన్: 08 వుదయం ప్రతినిధి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ప్రతి నెల 9వ తేదిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు ప్రధానంగా హైరిస్క్ గర్భాలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య పరీక్షలు, చికిత్స, పర్యవేక్షణ అందించడం. రక్తపోటు, రక్తహీనత, మధుమేహం వంటి పరీక్షలు చేసి అవసరమైన వైద్య సలహాలు, మందులు ఇవ్వడం. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలో గర్భిణీలను గుర్తించి పీఎం ఎస్ఎంఎస్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి. ముఖ్యంగా 2వ, 3వ త్రైమాసికంలో ఉన్న గర్భిణీలు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ఆరోగ్య సంస్థను సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత గర్భిణీ సేవలను సద్వినియోగం చేసుకొని తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిఎంహెచ్ఓ కోరారు.




# విద్యార్థులకు వరం.. భద్రగిరి మార్ట్‌లో సరసమైన ధరలకు విద్యా సామగ్రి

**అన్ని రకాల నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులు అందుబాటులో**

**భద్రగిరి మార్ట్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి : ఐటిడిఏ పీఓ బి. రాహుల్**



భద్రాచలం, జూన్ 08 (వుదయం ప్రతినిధి): కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌లో అన్ని రకాల విద్యా సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. విద్యార్థులకు అవసరమయ్యే సింగిల్ రూల్, డబుల్ రూల్, బ్రాడ్ రూల్, అన్‌రూల్డ్ నోట్‌బుక్స్, లాంగ్ బుక్స్, రికార్డు పుస్తకాలు, డ్రాయింగ్ బుక్స్, ప్రాజెక్ట్ ఫైల్స్‌తో పాటు జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిల్లు, షార్పనర్లు, ఎరేజర్లు, స్కేల్స్, కలర్ బాక్సులు, చార్టులు తదితర విద్యా సామగ్రి అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతుందని, అలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకు అందించడం ద్వారా ప్రజలకు మేలు చేయడమే భద్రగిరి మార్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంలో ఐటిడిఏ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. విద్యార్థుల చదువుకు అవసరమైన ప్రతి వస్తువు ఒకే చోట లభించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు వివిధ దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సులభంగా కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. భద్రగిరి మార్ట్‌లో విక్రయిస్తున్న విద్యా సామగ్రి నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు ఉపయోగపడే ఉత్తమ ప్రమాణాల వస్తువులను మాత్రమే అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ మార్ట్ ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా సేవలు అందిస్తోందన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని విద్యా సంబంధిత వస్తువులు, పోటీ పరీక్షల పుస్తకాలు, సాధారణ విజ్ఞాన గ్రంథాలు, విద్యా సహాయక పరికరాలను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి, విద్యా ప్రగతే లక్ష్యంగా భద్రగిరి మార్ట్ సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా భద్రగిరి మార్ట్‌ను సందర్శించి తక్కువ ధరలకు లభించే నోట్‌బుక్స్, విద్యా సామగ్రిని కొనుగోలు చేసి ఈ సంస్థ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ విజ్ఞప్తి చేశారు.

# కలివేరు గ్రామంలో గ్రామసభ

చర్ల జూన్ 08 (వుదయం ప్రతినిధి) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలివేరు గ్రామపంచాయతీ కార్యాలయం లో10 రోజుల ముగింపు గ్రామ సభల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల. గోపాల బుచ్చిబాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ముఖ్య లక్ష్యం గ్రామ ప్రజలకు తాగునీరు, కరెంట్, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, సమగ్ర ఓటర్ల సవరణ జాబితా (సిర్) బడిబాట వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ గ్రామ సభల లక్ష్యం తెలిపారు. గ్రామ సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం లో వచ్చే డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలను దృష్టిలో పెట్టుకుని



గ్రామంలో మురికి నీటి కాల్వలను శుభ్రపరచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, క్లోరినేషన్ పనులు చెయ్యాలని పంచాయతీ సిబ్బంది సూచించారు. కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, సాధ్యమైనంత వరకు దోమతెరలు ఉపయోగించాలని వారంలో రెండు రోజులు డ్రైడే' పాటించాలని కోరారు. వ్యవసాయ శాఖ ఏఈఓ రామకృష్ణ మాట్లాడుతూ రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల నీటి వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం. లక్ష్మణరావు , ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, కలివేరు సెక్రటరీ ఇర్పా. శ్రీ రాంమూర్తి, ఏఈఓ రామకృష్ణ, జిపిఓ సర్వేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు దశరథం పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

